సాక్షి జగిత్యాల
బుధవారం ׀ 26 ׀ మార్చి ׀ 2025



డయాలసిస్.. సేవలు భేష్

ఉమ్మడి జిల్లాలో మూత్రపిండాల బాధితులు పెరుగుతున్నారు. మధుమేహం, పొగ, మద్యం ,ఆహార నియమాలు పాటించక సమస్యతలెత్తు తున్నట్లు వైద్యులు చెబుతున్నారు. - 8లో



రైతులకు పరామర్శలే ప్రాప్తం

ఏటా రైతులు అయితే అధిక వర్షాలు.. లేకుంటే వడగండ్లు, ఈదురుగాలుల వంటి ప్రకృతి వైపరీత్యాలతో పంటలు నష్టపోతున్నారు. - 8లో



	ఇఫ్తార్ బుధవారం (సా॥)	సహర్ గురువారం (ఉ॥)
కరీంనగర్ :	6.30	4.56
పెద్దపల్లి :	6.34	4.54
సిరిసిల్ల :	6.29	5.03
జగిత్యాల :	6.34	4.54

న్యూస్‌రీల్

స్కానింగ్ సెంటర్లల్లో తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

మెట్‌పల్లి: పట్టణంలోని పలు స్కానింగ్ సెంటర్లల్లో మంగళవారం ఆర్డీవో శ్రీనివాస్, జిల్లా మాతా శిశు సంరక్షణ అధికారి జైపాల్‌రెడ్డి తనిఖీలు నిర్వహించారు. రికార్డులను పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ప్రతి సెంటర్‌లో లింగ నిర్ధారణ చేయబడదు అనే ఫ్లెక్సీలు ప్రదర్శించాలని సూచించారు. ప్రతి నెలా 5తేదీ లోపు కేటాయించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్కానింగ్ వివరాలు అందించాలని పేర్కొన్నారు. లింగనిర్ధారణ జరిపితే జరిమానాతోపాటు మూడు నెలల జైలు శిక్ష విధిస్తామన్నారు. వైద్యుల రిజిస్ట్రేషన్ రద్దు చేస్తామన్నారు. వారి వెంట హెల్త్ ఎడ్యుకేటర్స్ కటుకం భూమేశ్వర్, తరాల శంకర్, ఆరోగ్య విస్తీర్ణ అధికారి రాజేశం, సూపర్‌వైజర్ శ్యామ్ ఉన్నారు.

సీసీ కెమెరాలకు మరమ్మతు

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని పలు ప్రధాన చౌరస్తాల్లో ఉన్న సీసీ కెమెరాలను మున్సిపల్ ఉద్యోగులు సోమవారం ధ్వంసం చేసిన విషయం తెల్సిందే. ఇప్పటికే ముగ్గురు మున్సిపల్ ఉద్యోగులపై కేసు నమోదు చేసిన పోలీసులు మంగళవారం సీసీ కెమెరాలకు యుద్ధప్రతిపాదికన మరమ్మతు చేపట్టారు. మరికొన్ని సీసీ కెమెరాలను బుధవారం సాయంత్రం వరకు అందుబాటులోకి తెచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. సీసీ కెమెరాలను ధ్వంసం చేసిన మున్సిపల్ ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.


ఆయిల్ పాం సాగుతో రైతులకు లాభాలు



రైతులతో మాట్లాడుతున్న డీఏవో భాస్కర్

వెల్గటూర్: ఆయిల్ పాం సాగుతో రైతులు అధిక లాభాలు పొందవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి భాస్కర్ అన్నారు. మండలకేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం నిర్వహించిన రైతునేస్తం కార్యక్రమంలో పాల్గొన్నారు. రైతునేస్తం ప్రత్యేకత, వ్యవసాయ యాంత్రీకరణతో కలిగే లాభాలను రైతులకు వివరించారు. ఆయిల్ పాం సాగు విధానంలో సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ షాపులను తనిఖీ చేశారు. ఆయన వెంట మండల వ్యవసాయ అధికారి సాయి కిరణ్, ఏఈవోలు ఫిర్దోస్, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

'ఎల్‌ఆర్‌ఎస్'పై అవగాహన కల్పించాలి



రైస్‌మిల్లులో సీఎంఆర్ వివరాలు తెలుసుకుంటున్న లత

ధర్మపురి: ఎల్‌ఆర్‌ఎస్‌పై చాలామందికి అవగాహన లేదని, ప్రభుత్వం కల్పించిన 25శాతం తగ్గింపును ప్రజల్లోకి తీసుకెళ్లాలని అడిషనల్ కలెక్టర్ బీఎస్.లత అధికారులకు సూచించారు. మండలంలోని తిమ్మాపూర్‌లో మంగళవారం ఎల్‌ఆర్‌ఎస్‌పై సమీక్షించారు. గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అనంతరం ధర్మపురిలోని ఓ రైస్‌మిల్‌ను సందర్శించి సీఎంఆర్ సకాలంలో అప్పగించాలని, లేకుంటే మిల్లర్లపై చర్యలు తప్పవని హెచ్చరించారు. తహసీల్దార్ కృష్ణ చైతన్య, ఎంపీడీవో రవీందర్ తదితరులున్నారు.

నైపుణ్య శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

జగిత్యాల: యువత నైపుణ్య శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని అదనపు కలెక్టర్ లత అన్నారు. ప్రధానమంత్రి నైపుణ్య శిక్షణ పథకం కింద కోటి మంది యువతకు ఎంపిక చేసుకున్న వ్యాపారరంగంలో ఏడాదిపాటు నైపుణ్య శిక్షణ రూపొందించారని, ఉపాధి అవకాశాలు పెంచుకునేందుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. భద్రాద్రి, మేడ్చల్ మల్కాజిగిరి, పెద్దపల్లి జిల్లాల్లోని దాదాపు 200 కంపెనీల్లో నైపుణ్య శిక్షణ పొందేందుకు నమోదు ప్రక్రియ ప్రారంభమైందని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు ఈనెల 31లోపు P MI పోర్టల్ WWW.P MI NTQ N HIP. MC-A.GO V.I N ద్వారా నమోదు చేసుకోవాలన్నారు.

వసతుల్లేని శ్మశానవాటికలు



- ఈ చిత్రం మెట్‌పల్లిలోని కాపుల శ్మశాన వాటిక. ప్రహరీ, బోరు లేకపోవడం ఇబ్బందికరంగా మారింది. శవ దహనం అనంతరం స్నానాలు చేసేందుకు మున్సిపాలిటీ ట్యాంకర్‌పైనే ఆధారపడాల్సి వస్తోంది. మెట్‌పల్లిలో 9 శ్మశాన వాటికలు ఉన్నప్పటికీ ముఖ్యంగా నీటి వసతి, స్నానాల గదులు లేకపోవడంతో అంత్యక్రియలకు వచ్చిన బంధువులందరూ ఇబ్బంది పడుతున్నారు. మహిళల పరిస్థితి మరీ వర్ణనాతీతం.



ఈ చిత్రం జిల్లా కేంద్రంలోని గొల్లపల్లిరోడ్‌లో గల శ్మశాన వాటిక. ఇందులో సక్రమంగా నీరు లేకపోవడంతో అంత్యక్రియలకు వచ్చిన బంధువులకు ఇబ్బందికరంగా మారింది. ఇందులో శవాల దహనానికి వినియోగించే కట్టెలు ఇచ్చేవారు ఎప్పటి నుంచో ఉన్నారు. వారు బాధిత కుటుంబాల నుంచి అందినకాడికి దోచుకుంటున్నారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో టెండర్లు వేసి ఇవ్వాలని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. అలాగే మున్సిపల్ ట్యాంకర్ కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.



- ఇది కోరుట్లలోని శ్మశాన వాటిక. కోరుట్లలో 20 ఉన్నప్పటికీ కొన్ని చోట్లలోనే బాగున్నాయి. మిగతా చోట్ల కనీస వసతులు లేక నానా ఇబ్బందులకు గురవుతున్నారు. కట్టెలు లేకపోవడంతో ఎక్కడెక్కడి నుంచో తేవడంతో ఇబ్బందులకు గురవుతున్నారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో అంత్యక్రియలు పూర్తయ్యే వరకు అన్ని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



- ఇది ధర్మపురిలోని శ్మశాన వాటిక. రూ.కోటితో నిర్మించినప్పటికీ నిరుపయోగంగానే మారింది. వివిధ రకాల గదులు ఏర్పాటు చేసినా బాధ్యతలు ఎవరూ తీసుకోకపోవడంతో పారిశుధ్యం కరువై చెత్తాచెదారంతో నిండిపోయింది. బిగించిన తలుపులు విరిగిపోవడంతో మందుబాబులకు అడ్డాగా మారింది.



- ఇది రాయికల్‌లో నిర్మించిన వైకుంఠ దామం. ఇప్పటివరకు పనులు పూర్తి కాలేదు. రూ.కోటి నిధులు మంజూరైనప్పటికీ బర్నింగ్ షెడ్డు, ఫుడ్ స్టోరేజీ, శివుని విగ్రహం వంటి పనులు పూర్తి కాలేదు. దహన సంస్కారాల కోసం వచ్చే ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు.

- అంత్యక్రియలకు ఇబ్బంది పడుతున్న ప్రజలు
- స్నానాలు చేసేందుకు వేధిస్తున్న నీటి కొరత
- నీళ్లు చల్లుకుని ఇంటికి చేరుతున్న బంధువులు
- పట్టింపులేని మున్సిపల్ అధికారులు
- టెండర్లు పిలవాలంటున్న బాధితులు

జగిత్యాల: జిల్లాలోని శ్మశాన వాటికల్లో వసతులు లేక ప్రజలు నానా ఇబ్బందులకు గురవుతున్నారు. శ్మశాన వాటికల నిర్వహణ బాధ్యత మున్సిపాలిటీలదే. అయితే అందులో సరైన వసతులు లేకపోవడంతో అంత్యక్రియలకు వచ్చిన బంధువులు స్నానాలు చేసేందుకు.. ఇతరత్రా కార్యక్రమాలు పూర్తిచేసేందుకు ఇబ్బంది పడుతున్నారు. కనీసం నీటి వసతి లేకపోవడంతో ట్యాంకర్ల ద్వారా తెప్పించుకోవాల్సి వస్తోందనిబాధితులుచెబుతున్నారు. స్నానాలు చేసిన తర్వాత బట్టలు మార్చుకునేందుకు గదులు లేవు.

దోపిడీని అరికట్టేదెలా..?

శ్మశాన వాటికల్లో దోపిడీ అధికమవుతోందని బాధిత కుటుంబాలు ఆరోపిస్తున్నాయి. దహనానికి వినియోగించే కట్టెలకు టెండర్లు వేసేవారు లేకపోవడంతో అక్కడున్నవారు ఎంత అడిగితే అంతమొత్తం చెల్లించాల్సి వస్తోంది. కట్టెలకు మున్సిపాలిటీ ద్వారా టెండర్లు పిలిస్తే బాధితులందరికీ ఒకే ధరకు కట్టెలు లభించడంతోపాటు మున్సిపాలిటీకి కూడా ఆదాయం వస్తుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

గదులు లేక ఇబ్బంది

మున్సిపాలిటీ పరిధిలో ఇల్లు లేని వారి బంధువులు చనిపోతే వారు అద్దెకు ఉండే ఇంటి యజమానులు శవాలను అనుమతించరు. ఇలాంటి వారికోసం శ్మశాన వాటికల్లో అంత్యక్రియలు పూర్తి చేసి.. అనంతరం జరిగే ఇతరత్రా కార్యక్రమాలు చేసుకునేందుకు వీలుగా మున్సిపాలిటీ ఆధ్వర్యంలో గదులు నిర్మిస్తామని ప్రకటించారు. కానీ.. అది ఇప్పటికీ కార్యరూపం దాల్చలేదు. జిల్లాకేంద్రంలో ఒక మోతె శ్మశాన వాటికలో మాత్రం గదులు ఉన్నాయి. మిగతాచోట్ల ఎక్కడా లేవు. 12 రోజులపాటు కార్యక్రమాలు నిర్వహించుకునేలా వసతులు ఏర్పాటు చేస్తే ఇల్లు లేని వారికి ఎంతో మేలుగా ఉంటుందని ప్రజలు అంటున్నారు.

వైకుంఠదామం పూర్తి చేయాలి



రాయికల్ వైకుంఠ దామంలో నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. తరుచూ బోరు రిపేరుకు రావడంతో స్నానాలకు ఇబ్బందికరంగా మారింది. దూరంలో ఉన్న వాగులోకి వెళ్లాల్సి వస్తోంది. అధికారులు స్పందించి వైకుంఠదామం పూర్తి చేయాలి.

– వెంకటేశ్, రాయికల్

ఉపయోగంలోకి తేవాలి



ధర్మపురిలో రూ.కోటితో నిర్మించిన శ్మశాన వాటికలో అన్ని వసతులున్నప్పటికీ ఉపయోగంలో లేదు. పూర్తి శిథిలావస్థకు చేరాయి. మున్సిపల్ అధికారులు స్పందించి దానిని ఉపయోగంలోకి తెచ్చేలా చర్యలు తీసుకోవాలి. అధికారులు స్పందించాలి.

– బందారు లక్ష్మణ్, ధర్మపురి

గదులు నిర్మించాలి



చాలామంది ఉపాధి వెతుక్కుంటూ పట్టణాలకు వస్తున్నారు. అద్దె ఇళ్లలో ఉంటున్నారు. ఇంట్లో ఎవరైనా అకస్మాత్తుగా మరణిస్తే ఇంటి యజమానులు శవాన్ని అనుమతించడం లేదు. అలాంటి వారికి అంత్యక్రియలు పూర్తయ్యేంత వరకు గదులు అందుబాటులో ఉంచాలి.

– కిరణ్ కుమార్, జగిత్యాల

బల్దియా ప్రజలకు శుద్ధనీరు అందిస్తాం



ఫిల్టర్‌బెడ్ పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

రాయికల్: రాయికల్ మున్సిపల్ ప్రజలకు స్వచ్ఛమైన నీరందిస్తామని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ఫిల్టర్‌బెడ్‌ను ఇరిగేషన్ అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు. జగిత్యాల నియోజకవర్గంలో ఫిల్టర్‌బెడ్‌ల మరమ్మతు కోసం రూ.14 కోట్లు మంజూరయ్యాయని, యుద్ధ ప్రతిపాదికన పనులు చేపట్టి నెలలోపు తాగునీరు అందిస్తామని పేర్కొన్నారు. పట్టణంలో 9, 10, 11 వార్డుల్లో తాగునీటి సమస్య పరిష్కరించాలని, పైప్‌లైన్ బూస్టర్ పంప్ బోర్‌వెల్ ద్వారా సరఫరా చేయాలని సూచించారు. పట్టణంలో అమృత్-2 పథకానికి స్థల సేకరణ చేపట్టాలని కమిషనర్‌ను ఆదేశించారు. ఆయన వెంట కమిషనర్ మనోహర్‌గౌడ్, ఇరిగేషన్ డీఈ జలేందర్‌రెడ్డి, ఏఈలు ప్రసాద్, దీపక్, చంద్రకాంత్, పట్టణ అధ్యక్షుడు మ్యాకల రమేశ్, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొయ్యడి మహిపాల్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోపి రాజిరెడ్డి, హనుమాన్ ఆలయ కమిటీ చైర్మన్ దాసరి గంగాధర్, మాజీ సర్పంచ్ ఎద్దండి భూమారెడ్డి, బాపురపు నర్సయ్య, బత్తిని భూమయ్య, శ్రీకాంత్, రమేశ్, సంతోష్ పాల్గొన్నారు.

రోళ్లవాగు పరిశీలన



ప్రాజెక్టు వివరాలు సేకరిస్తున్న అధికారులు

సారంగాపూర్: రోళ్లవాగు ప్రాజెక్టు నిర్మాణంలో పర్యావరణానికి ఏమైనా నష్టం ఉందా..? అనే అంశంపై అటవీశాఖలో అడవుల పరిరక్షణ బృందం మంగళవారం వివరాలు సేకరించింది. డిప్యూటీ కన్జర్వేటర్ వెంకటేశ్వర్‌రావు ఆధ్వర్యంలో ఏడుగురు సీనియర్ ఫారెస్ట్ అధికారులు ప్రాజెక్టు నిర్మాణంలో అటవీశాఖ, ఇంజినీరింగ్ అధికారులు పంపిన నివేదికలోని వివరాలు సరైనవేనా..? వన్యప్రాణులకు ఎంత మేర నష్టం జరగనుంది..? ఎన్ని చెట్లు కోల్‌తున్నాం..? వంటి అంశాలు సేకరిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. వారి వెంట ప్రాజెక్టు డీఈ చక్రూనాయక్, ఏఈ అనిల్, సూపర్‌వైజర్ మోహన్ తదితరులు ఉన్నారు.

మార్గదర్శకాల మేరకే ఇందిరమ్మ ఇళ్లు

సారంగాపూర్: ప్రభుత్వం నిర్ధేశించిన నమూనాల్లోనే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టాలని కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో కలెక్టర్ మంగళవారం పర్యటించారు. చిత్రవేణిగూడెంలో ఇందిరమ్మ ఇళ్ల గ్రౌండింగ్ స్థలాలు, నిర్మాణంలో ఉన్న ఇళ్ల ప్రగతిని పరిశీలించారు. దశలవారీగా బిల్లులు చెల్లించనున్నట్లు వివరించారు. బీర్‌పూర్‌లో రూ.1.43 కోట్లతో నిర్మిస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. నిధులు ఉన్నా పనుల జాప్యమెందుకని ప్రశ్నించారు. కొల్వాయి, తాళ్లధర్మారం, లక్ష్మీదేవిపల్లిలో రూ.20లక్షల చొప్పున నిధులతో నిర్మిస్తున్న పల్లె దవాఖానాల పనులను పరిశీలించారు. డీపీవో మదన్‌మోహన్, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీనివాస్, డీఈ మిలింద్, తహసీల్దార్లు జమీర్, ముంతాజొద్దీన్, ఎంపీడీవోలు గంగాధర్, లచ్చాలు, ఎంపీవో సలీం ఉన్నారు.



చిత్రవేణిగూడెంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్

కొనుగోలు కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించాలి

జగిత్యాలఅగ్రికల్చర్: యాసంగిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ అన్నారు. జిల్లా అధికారులు, ట్రాన్స్‌పోర్టు నిర్వాహకులు, రైస్‌మిల్లర్లతో సమీక్షించారు. కేంద్రాల్లో వసతులు కల్పించాలన్నారు. రవాణాలో ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. టార్పాలిన్లు, గన్నీబ్యాగులు, క్లీనింగ్ మిషన్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. అడిషనల్ కలెక్టర్ బీఎస్.లత, మార్కెటింగ్ అధికారి ప్రకాశ్, సివిల్ సప్లై డీఎం జితేందర్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి జితేందర్ రెడ్డి పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో ఇఫ్తార్

జగిత్యాల: కలెక్టరేట్‌లో మంగళవారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ఒకరినొకరు గౌరవించుకునే స్ఫూర్తి, సహాయ సహకారాలు పెంపొందించుకునే గొప్ప సమయం రంజాన్ అన్నారు. ఆర్డీవో శ్రీనివాస్, కలెక్టరేట్ ఏవో హకీం, వకీల్, నాగేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

కుష్ఠు నిర్మూలనకు సహకరించాలి



నర్సింహులపల్లెలో సర్వే చేస్తున్న సిబ్బంది

సారంగాపూర్: కుష్ఠువ్యాధి నిర్మూలనకు ప్రజలు సహకరించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీని వాస్ అన్నారు. బీర్‌పూర్ మండలం నర్సింహులపల్లెలో లెప్రసీ (ఎల్‌సీడీసీ)పై వైద్యసిబ్బంది సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. వ్యాధి లక్షణాలను వివరించారు. శరీరం స్పర్శలేకుండా రాగి రంగులో, ఎర్రబారిన రంగులో మచ్చలు ఉంటే ఏడాదిపాటు మందులు వాడాలని సూచించారు. ఐదు మచ్చల కంటే తక్కువగా ఉంటే ఆరు నెలలు మందులు వాడాలని పేర్కొన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మందులను అందుబాటులో ఉంచుతున్నామని, వైద్యులు సలహాలు పాటిస్తూ, మందులు తీసుకోవాలన్నారు. లెప్రసీ బాధితులను పకడ్బందీగా గుర్తించాలని సూచించారు. ఆయన వెంట సీహెచ్‌వో కుద్దుస్, సూపర్‌వైజర్లు శ్రీనివాస్, కిశోర్, ఏఎన్‌ఎంలు ఉన్నారు.

'రైతులను విస్మరించిన ప్రభుత్వం'



మాట్లాడుతున్న ఎల్.రమణ, చిత్రంలో జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత తదితరులు

జగిత్యాల: అకాలవర్షాలు, వడగండ్లతో రైతులు పంటలు నష్టపోయినా వారిని ఓ మంత్రి కూడా పరామర్శించలేదని ఎమ్మెల్సీ ఎల్.రమణ అన్నారు. జగిత్యాలలో మంగళవారం మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల్లో ఒక్కటీ అమలు చేయలేదన్నారు. అసెంబ్లీలో ప్రశ్నిస్తే దాటవేసే ధోరణిలో ఉన్నారని తెలిపారు. ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వం రూ.1.58లక్షల కోట్లు అప్పు చేసిందని, ఇంత స్వల్పకాలంలో అంత అప్పు ఎవరూ చేయలేదని విమర్శించారు. రూ.2 లక్షల రుణమాఫీ ఎక్కడా జరగలేదన్నారు. ప్రభుత్వం కళ్లు తెరిచి అకాలవర్షాలతో నష్టపోయిన రైతులను పరామర్శించి వారికి భరోసా కల్పించాలన్నారు. జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత మాట్లాడుతూ కాంగ్రెస్ అసమర్థ పాలనలో పంటలు ఎండిపోతున్నాయని, వెంటనే రైతులను ఆదుకోవాలన్నారు. నాయకులు సతీశ్, గంగాధర్ పాల్గొన్నారు.

సీఎం సహాయనిధిని వినియోగించుకోవాలి

సీఎం సహాయనిధిని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్సీ అన్నారు. తన క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గంలోని పలువురికి సీఎం సహాయనిధి చెక్కులు అందించారు. వైద్య ఖర్చుల నిమిత్తం ఇవి ఉపయోగపడతాయని పేర్కొన్నారు.

గల్ఫ్ ట్రావెల్స్‌పై నిఘా కరువు

- విచ్చలవిడిగా అర్హత లేని ఏజెన్సీలు
- అనుమతులు లేకుండానే ఇంటర్వ్యూలు
- 'మెడికల్' పేరుతో వసూళ్లు
- నకిలీ వీసాలు అంటగట్టి మోసాలు

- జగిత్యాల రూరల్ మండలం పొరండ్ల గ్రామానికి చెందిన ఓ యువకుడు ఊరిలో ఉపాధి కరువై విదేశాలకు వెళ్లేందుకు ప్రయత్నిస్తుండగా.. నిజామాబాద్ జిల్లాకు చెందిన ఓ వ్యక్తి తారసపడ్డాడు. అతడి నుంచి రూ. లక్ష తీసుకుని ఏడాదికాలంగా తిప్పించుకుంటున్నాడు.

- రాయికల్ మండలకేంద్రానికి చెందిన ఇద్దరు యువకులు జగిత్యాలకు చెందిన ఓ ఏజెంట్‌కు న్యూజిలాండ్‌కు వెళ్లేందుకు రూ.4లక్షల చొప్పున చెల్లించారు. నకిలీ వీసాలు అంటగట్టడంతో వారు ఏజెంట్‌ను నిలదీశారు. దీంతో తీసుకున్న డబ్బులు ఇచ్చేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు.

- నిజామాబాద్ జిల్లాకు చెందిన పలువురు యువకులను జగిత్యాల జిల్లా కేంద్రంలోని ధర్మపురి రోడ్‌లోని ఓ మ్యాన్‌పవర్ కన్సల్టెన్సీ వారు లక్షల్లో వసూలు చేసి కంప్యూటర్ ఆపరేటర్ పేరుతో సైబర్ క్రైం చేసేందుకు లావోస్‌కు పంపించారు. వారంతా సైబర్ నేరాలు చేసేందుకు నిరాకరించి స్వగ్రామం చేరుకుని ఏజెంట్లపై కేసు నమోదు చేయించారు. ఓ ఏజెంట్ పోలీసుల కస్టడీలో మృతిచెందిన సంఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది.

జగిత్యాలక్రైం: జగిత్యాల జిల్లాలో ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లే వారి సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతోంది. మూడేళ్లుగా గల్ఫ్ వలసలు భారీగా పెరిగాయి. దీనిని అదునుగా తీసుకున్న కొంతమంది ట్రావెల్స్, గల్ఫ్ ఏజెంట్ల పేరుతో గల్ఫ్ పంపిస్తామని పెద్ద ఎత్తున మోసాలకు పాల్పడుతున్నారు. ఎలాంటి అనుమతి లేకుండా జిల్లాలో సుమారు 180 ట్రావెల్స్ అనధికారికంగా నడుస్తున్నాయి. గ్రామీణప్రాంతాలు, పట్టణ ప్రాంతాల్లోని నిరుద్యోగులకు విదేశీల్లో ఉపాధి కల్పిస్తామని గల్ఫ్ ఏజెంట్లు నిరుద్యోగులకు ఆశచూపి మోసాలకు పాల్పడుతున్నారు. వీరు వాస్తవానికి విమాన టికెట్స్ బుకింగ్ చేసేందుకే అనుమతి తీసుకుంటున్నారు. తర్వాత నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తామని చెప్పి పాస్‌పోర్టులు తీసుకొని ఇంటర్వ్యూలకు పిలుస్తున్నారు. వీసా వచ్చిందని నమ్మిస్తూ నిరుద్యోగుల నుంచి లక్షలు వసూలు చేస్తున్నారు. అదే ట్రావెల్స్‌లో మనీ ట్రాన్స్‌ఫర్ కేంద్రాలు నిర్వహిస్తున్నారంటే వారి ఆగడాలు ఎలా ఉన్నాయో తెలుసుకోవచ్చు. నిరుద్యోగులు స్థానికంగా ఉన్న ఏజెన్సీలు, ట్రావెల్స్‌లను నమ్మి లక్షలాది రూపాయలు చేతిలో పెట్టి మోసపోతున్నారు.



గల్ఫ్ ఇంటర్వ్యూలకు హాజరైన నిరుద్యోగులు (ఫైల్)

31 మందికే లైసెన్స్‌లు

జిల్లాలో గల్ఫ్ పంపించేందుకు కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ నుంచి కేవలం 31 మంది ఏజెంట్లు మాత్రమే లైసెన్స్‌లు తీసుకుని ట్రావెల్స్ నిర్వహిస్తున్నారు. మరో ముగ్గురు లైసెన్స్ రెన్యూవల్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. మిగతా వారు పెద్ద ఎత్తున ఎలాంటి అనుమతులు లేకుండా ట్రావెల్స్, ఏజెంట్లుగా చలామణి అవుతూ నిరుద్యోగులకు వీసాల పేరుతో పెద్ద ఎత్తున వసూలు చేస్తూ మోసాలకు పాల్పడుతున్నారు.

లైసెన్స్ లేకున్నా ఇంటర్వ్యూలు

జిల్లాలో గల్ఫ్ ఏజెంట్లు ట్రావెల్స్ నిర్వాహకులు లైసెన్స్ ఉన్నా ఎస్పీ పోలీసులకు సమాచారం అందించి ఇంటర్వ్యూలు నిర్వహించాలి. వారు పోలీసులకు ఎలాంటి సమాచారమూ లేకుండానే ఇష్టారీతిలో జిల్లాకేంద్రంలోనే పెద్ద ఎత్తున ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారు. హైదరాబాద్, ముంబయ్, చెన్నై, ఢిల్లీలో ఉన్న ట్రావెల్స్ యజమానులతో కలిసి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారు. పాస్‌పోర్టులు తీసుకొని వారికి ఏదో ఒక వీసా అప్పగిస్తున్నారు.

యూరప్ దేశాలకూ ఇంటర్వ్యూలు

జిల్లాలో గతంలో కేవలం లైసెన్స్ ఉన్న ట్రావెల్స్ గల్ఫ్ దేశాలకు మాత్రమే నిరుద్యోగ యువకులను పంపించేవారు. కానీ ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా లైసెన్స్‌లు ఉన్నవారు, లేని వారు నిరుద్యోగులను యూరప్ దేశాల్లో ఉద్యోగాలున్నాయని సుమారు రూ.2లక్షల నుంచి రూ.5 లక్షల వరకు వసూలు చేస్తున్నారు.

నిఘా కరువు

ప్రస్తుతం పోలీసు శాఖ కళ్లుగప్పి జిల్లాలో జోరుగా గల్ఫ్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారు. జిల్లాలో లైసెన్స్‌డ్ ట్రావెల్స్ యజమానులు మాత్రమే ఎస్పీ పోలీసు శాఖ అనుమతి తీసుకుని ఇంటర్వ్యూలు నిర్వహించాల్సి ఉంది. చాలామంది ఎస్పీ పోలీసులకు తెలియకుండా ఇంటర్వ్యూలు నిర్వహించి ఇంటర్వ్యూల పేరుతో నిరుద్యోగుల నుంచి పెద్ద ఎత్తున చార్జీలు వసూలు చేస్తున్నారు. అలాగే వీసా వచ్చిందని, (మెడికల్) వైద్య పరీక్షలు పేరుతో అందినకాడికి దోచుకుంటున్నారు.

ఫిర్యాదు చేస్తే చర్యలు



గల్ఫ్ దేశాలకు వెళ్లే వారు నకిలీ ఏజెంట్లకు డబ్బులు ఇచ్చి మోసపోవద్దు. ఎమిగ్రేషన్ చట్టబద్ధత ఉన్న వారి దగ్గరి నుంచే వీసాలు పొందాలి. ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి గల్ఫ్ మోసాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు చేపడతాం. ఎవరైనా నకిలీ ఏజెంట్లు మోసం చేస్తే ఫిర్యాదు చేస్తే కేసులు నమోదు చేస్తాం.

– అశోక్‌కుమార్, ఎస్పీ

క్లుప్తంగా

ఆగిన అమ్మ గుండె.. తల్లడిల్లిన టెన్త్ విద్యార్థి



తల్లి శవయాత్రలో ఆమాన్



లత(ఫైల్)

కోనరావుపేట(వేములవాడ): ఓ వైపు పదో తరగతి పరీక్షలు.. మరోవైపు కన్నతల్లి హఠాన్మరణం చెందడంతో ఆ విద్యార్థి తల్ల డిల్లిపోయాడు. కోనరావుపేట మండలం నిమ్మపల్లి గ్రామానికి చెందిన అమరం జనార్దన్‌రెడ్డి–లత దంపతుల కుమారుడు ఆమన్‌రెడ్డి ప్రస్తుతం కరీంనగర్‌లో పదో తరగతి పరీక్షలు రాస్తున్నాడు. సోమవారం అనారోగ్య సమస్యతో ఆస్పత్రికి వెళ్లిన లత అక్కడే గుండెపోటుకు గురై మృతిచెందింది. పుట్టెడు దుఃఖంలో మంగళవారం అంత్యక్రియలు నిర్వహించాడు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు షేక్ ఫిరోజ్‌పాషా, దేవయ్య, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

వృద్ధురాలిపై అత్యాచారం

సైదాపూర్: మండలంలోని బొమ్మకల్ గ్రామంలో ఓ వృద్ధురాలిపై ఆదివారం రాత్రి ఓ యువకుడు అత్యాచారం చేసినట్లు బాధితురాలు సైదాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్‌కు చెందిన యువకుడు కుటుంబంతో వృద్ధురాలి ఇంట్లో ఉంటూ గ్రామంలో చికెన్ సెంటర్ నడుపుతున్నాడు. కొద్దిరోజుల క్రితం భార్యాపిల్లలు కరీంనగర్‌లోని ఇంటికి వెళ్లారు. కాగా ఆదివారం రాత్రి వృద్ధురాలిపై యువకుడు అత్యాచారం చేసినట్లు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి పోలీసులు విచారిస్తున్నట్లు తెలిసింది.

బండి సంజయ్‌పై బీఆర్‌ఎస్ ఫిర్యాదు



ఏసీపీకి ఫిర్యాదు చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

కరీంనగర్: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ చిల్లర మాటలతో కాలయాపన చేసి, పదవీకాలం వెల్ల దీస్తున్నాడని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పొన్నం అనిల్ కుమార్‌గౌడ్ అన్నారు. కేసీఆర్‌ను దొంగ నోట్లు ముద్రించాడని చేసిన ఆరోపణను ఖండిస్తూ బండి సంజయ్ కుమార్‌పై చర్యలు తీసుకోవాలని టౌన్ ఏసీపీకి ఫిర్యాదు చేశారు. బండి సంజయ్ చిల్లర మాటలతో కరీంనగర్ ప్రతిష్టను దిగజారుస్తున్నాడని అన్నారు. ఇలాంటి వ్యాఖ్యలు పునరావృతమైతే కరీంనగర్ ప్రజలు మిమ్మల్ని తిరస్కరిస్తారని హెచ్చరించారు. బీఆర్‌ఎస్ నగర ప్రధాన కార్యదర్శి గడ్డం ప్రశాంత్‌రెడ్డి, శాతవాహన యూనివర్సిటీ ఇన్‌చార్జి చుక్క శ్రీనివాస్, బీఆర్‌ఎస్‌వీ నగర అధ్యక్షుడు బొంకూరి మోహన్, గంగాధర చందు, రవిగౌడ్, ఒడ్నాల రాజు పాల్గొన్నారు.

రిజర్వాయర్‌లో బాలుడి గల్లంతు

గొల్లపల్లి: మండలంలోని రంగధాముని పల్లి రిజర్వాయర్‌లో పడి నేరెళ్ల నరేశ్ (12) గల్లంతైన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. ఎస్సై సతీష్ కథనం ప్రకారం గ్రామానికి చెందిన నరేష్ స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. మధ్యాహ్నం ఇంటికి వచ్చి ఈత కోసం గ్రామ శివారులోని రిజర్వాయర్‌కు వెళ్లాడు. ప్రమాదవశాత్తు అందులో పడి గల్లంతయ్యాడు. కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్సై గజఈతగాళ్లతో గాలించారు. రాత్రి 8 గంటల వరకు గాలించినా ఆచూకీ లభించలేదు.

‘దళితబంధు’ విడుదల చేయండి

- రెండోవిడత నిలుపుదలపై హైకోర్టుకు లబ్ధిదారుడు
- వెంటనే నిధులు అందజేయాలని వినతి
- రాష్ట్రవ్యాప్తంగా నిలిచిపోయిన బకాయిలు మొత్తం రూ.324 కోట్లు
- అందులో రూ.265 కోట్లు హుజూరాబాద్‌వే



పంపిణీకి సిద్ధంగా ఉన్న దళితబంధు వాహనాలు(ఫైల్)

సాక్షిప్రతినిధి,కరీంనగర్: దళితుల సామాజిక, ఆర్థిక స్థితిగతులను మార్చాలన్న లక్ష్యంతో గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకం దళితబంధు. రాష్ట్రవ్యాప్తంగా అమలు చేసిన ఈ పథకం ప్రభుత్వం మారడంతో నిలిచిపోయింది. పథకాన్ని అమలు చేయాలని ప్రభుత్వం నుంచి తాజా ఆదేశాలు ఉన్నా.. జిల్లాస్థాయిలో అధికారుల నుంచి ఎలాంటి స్పందన లేదు. దీంతో ఈ వ్యవహారం ఇప్పుడు హైకోర్టు గడప తొక్కింది. తనకు రావాల్సిన బకాయిలు ఇప్పించాలని లబ్ధిదారుడు ఈ పిటిషన్ దాఖలు చేశాడు. ఈ నేపథ్యంలో రెండో విడత బకాయిల విడుదలపై మరో సారి రాష్ట్రవ్యాప్తంగా చర్చ మొదలైంది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో దాదాపు రూ.324 కోట్లు విడుదల కావాల్సి ఉండగా ఒక్క కరీంనగర్ జిల్లాలోనే రూ.265 కోట్ల వరకు బకాయిలు ఉండటం గమనార్హం.

అసలేం జరిగింది?

ప్రతీ దళిత కుటుంబానికి రూ.10 లక్షల ఆర్థిక సాయం చేసి వారిని, వాణిజ్యవేత్తలుగా తీర్చిదిద్దాలన్న ఆశయంతో 2021 ఆగస్టులో ఈ పథకాన్ని అప్పటి సీఎం కేసీఆర్ హుజూరాబాద్‌లో పైలెట్ ప్రాజెక్టుగా ప్రారంభించారు. ఇందులో దాదాపు 18,000 కుటుంబాలను అర్హులుగా గుర్తించారు. ప్రభుత్వం రూ.2500 కోట్ల వరకు విడుదల చేసింది. వీరికి ఎస్సీ కార్పొరేషన్ ద్వారా దాదాపు రూ.1800 కోట్లకు పైగా నిధులు విడుదల చేసి, వివిధ యూనిట్లను గ్రౌండింగ్ చేశారు. ఇందులో అనేక రకాల వ్యాపారాలు, వాహనాలు తదితర యూనిట్లు ఉన్నాయి. రెండో విడతలో దాదాపు 7000 మంది ఎంపికయ్యారు. వీరికి రూ.265.62 కోట్లు రిలీజ్ అయ్యాయి. వీటిని ప్రభుత్వం ఇప్పటికే లబ్ధిదారుల ఖాతాల్లో వేసింది. ఈ డబ్బులను డ్రా చేయకుండా ప్రభుత్వం ఆపింది. ఇందులో లబ్ధిదారులకు రూ.లక్ష నుంచి రూ.10 లక్షల వరకు బకాయిలు విడుదల కావాల్సి ఉంది. గతేడాది జూన్‌లోనే రెండో విడత బకాయిలు విడుదల చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినా క్షేత్రస్థాయిలో అమలుకాకపోవడంతో లబ్ధిదారులు హైకోర్టును ఆశ్రయించారు.

హుజురాబాద్‌లోనే రూ.265 కోట్లు

ఆదిలాబాద్ రూ.68.08 లక్షలు, భద్రాద్రి కొత్తగూడెం రూ.69.48 లక్షలు, హన్మకొండ రూ.33.75 లక్షలు, హైదరాబాద్ రూ.10.20 లక్షలు, జగిత్యాల రూ.42.76లక్షలు, జనగామ రూ.21.84లక్షలు , జయశంకర్‌భూపాలపల్లి రూ. 12.10 లక్షలు, జోగులాంబ గద్వాల రూ. 5.80, కామారెడ్డి రూ. 8.10 లక్షలు, ఖమ్మం రూ.2.41 కోట్లు, కొమురంభీమ్(ఆసిఫాబాద్) రూ. 48.59 లక్షలు, మహబూబాబాద్ రూ. 31.79 లక్షలు, మహబూబ్‌నగర్ రూ. 31.79 లక్షలు, మంచిర్యాల రూ.3.90 లక్షలు, మెదక్ రూ. 0.57 లక్షలు, మేడ్చల్–మల్కాజిగిరి రూ.40.46 లక్షలు నాగర్‌కర్నూల్ రూ.36.63 లక్షలు, నల్లగొండ రూ.25.77లక్షలు, నిజామాబాద్ రూ.4.92 లక్షలు, పెద్దపల్లి రూ.84.37లక్షలు, రాజన్నసిరిసిల్ల రూ. 79.00 లక్షలు రంగారెడ్డి రూ.7.99 లక్షలు సంగారెడ్డి రూ.44.63, సిద్దిపేట రూ. 55.80లక్షలు, సూర్యాపేట్ రూ.12.60లక్షలు, వికారాబాద్ రూ.66.46 లక్షలు, వనపర్తి రూ.14.90 లక్షలు, యాద్రాద్రి భువనగిరి రూ.1.18 కోట్లు కాగా మొత్తం రూ.11.93 కోట్లు బకాయిలు ఉన్నాయి. ఇవి కాక, పైలెట్ ప్రాజెక్టుల కింద హుజూరాబాద్ ఏసీ(కరీంనగర్) రూ. 265.62 కోట్లు, హుజూరాబాద్ ఏసీ(హన్మకొండ) రూ. 15.57 కోట్లు, కామారెడ్డి(నిజాంసాగర్)1.20 కోట్లు, ఖమ్మం(చింతకాని) రూ.28.05 కోట్లు నాగర్‌కర్నూల్(చారగొండ) రూ.1.32 కోట్లు, సూర్యపేట్(తిరుమలగిరి) రూ.90.61 లక్షలు, వాసాలమర్రి(యాద్రాద్రి) రూ.13.57లక్షలు కాగా.. మొత్తం రూ. 324.75 కోట్లు నిధులు ప్రభుత్వం నుంచి లబ్ధిదారులకు విడుదల కావాల్సి ఉంది.

అప్పులబాధతో ఒకరు.. అనారోగ్యంతో మరొకరు

- తంగళ్లపల్లి మండలంలో ఇద్దరి బలవన్మరణం



రాజు (ఫైల్)

తంగళ్లపల్లి(సిరిసిల్ల): వేర్వేరు కారణాలతో ఇద్దరు వ్యక్తులు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల పరిధిలో జరిగింది. బాధిత కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని ఇందిరమ్మకాలనికి చెందిన నేత కార్మికుడు పరికిపెల్లి రాజు (55)కు భార్య పద్మ, కొడుకు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. అందరి వివాహాలు జరిపించగా రూ.5 లక్షలమేర అప్పు అయ్యింది. కొద్దిరోజులుగా పవర్లూమ్స్ పని దొరక్కపోవడంతో మనస్తాపానికిగురై మద్యానికి బానిసయ్యాడు. సోమవారం సాయంత్రం కుటుంబ సభ్యులతో గొడవపడిన రాజు మనస్తాపంతో బాత్రూమ్‌లు కడిగేందుకు ఉపయోగించే యాసిడ్ తాగాడు. సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ మంగళవారం మృతిచెందాడు.



విష్ణు (ఫైల్)

మండలంలోని చీర్లవంచ గ్రామానికి చెందిన మొగిలోజి విష్ణు (45) వడ్రంగి పనిచేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు.. రెండేళ్లక్రితం పక్షవాతం రావడంతో పనిచేయలేని పరిస్థితిలో కాలం వెళ్లదీస్తున్నాడు. అతడికి భార్య కవిత, కొడుకు, పుట్టుకతో అంధురాలైన కూతురు ఉన్నారు. మంగళవారం కవిత ఉపాధిహామీ పనికి వెళ్లగా ఇంటిలోని బాత్‌రూమ్‌లో తాడుతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. రెండు కేసులు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

100గ్రాముల బంగారం, రూ.40వేల నగదు చోరీ

పెద్దపల్లిరూరల్: జిల్లా కేంద్రంలోని పాతబజార్‌లో వ్యాపారి దేవరకొండ కరుణాకర్‌కు చెందిన దుకాణంలో మంగళవారం తెల్లవారుజామున చోరీ జరిగింది. ఈ ఘటనలో మొదటి అంతస్తులోని దుకాణం తాళాలు పగులగొట్టి లోనికి ప్రవేశించిన దొంగలు.. 100గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.40వేల నగదు ఎత్తుకెళ్లారని యజమాని కరుణాకర్ తెలిపారు. సమాచారం అందుకున్న సీఐ ప్రవీణ్ కుమార్, ఎస్సై మల్లేశ్ ఘటనాస్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించారు. భవనానికి మరమ్మతులు చేపట్టడంతో దుకాణాన్ని ఫస్ట్‌ఫ్లోర్‌లోకి మార్చారని, దొంగలు షటర్‌ను పగులగొట్టి లోనికి చొరబడి ఆభరణాలు ఎత్తుకెళ్లారని పేర్కొన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసు అధికారులు తెలిపారు.



వివరాలు సేకరిస్తున్న పోలీసు అధికారులు

కారును ఢీకొన్న టిప్పర్.. పాస్టర్ దుర్మరణం



పాస్టర్ కరుణాకర్ (ఫైల్)

ఫెర్టిలైజర్‌సిటీ/ఎల్కతుర్తి: టిప్పర్.. కారును ఢీకొంది. ఈ ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందారు. ఈ ఘటన మంగళవారం తెల్లవారుజామున హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తపల్లి శివారులో జరిగింది. ఎస్సై సాయిబాబు కథనం ప్రకారం.. పెద్దపల్లి జిల్లా రామగుండం ఎన్‌టీపీసీ జ్యోతినగర్‌కు చెందిన కనుకపుడి కరుణాకర్(58) రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్ గౌతమినగర్‌లోని గ్లోరియస్ మినిస్ట్రిస్ చర్చిలో పాస్టర్. సోమవారం రాత్రి ఒంటి గంటకు కారులో ఎల్కతుర్తి నుంచి హుస్నాబాద్ వైపు వెళ్తున్నారు. ఈ క్రమంలో మార్గమధ్యంలోని హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తపల్లి శివారులోని ధాయ్ విహార్ సమీపంలో ముల్కనూరు వైపు నుంచి వస్తున్న టిప్పర్ ఎదురుగా వస్తున్న కారును ఢీకొంది. ఈ ఘటనలో కారు నడుపుతున్న కరుణాకర్‌కు తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే దుర్మరణం చెందారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. పాస్టర్ కరుణాకర్ మృతికి ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ సంతాపం తెలిపారు.



టిప్పర్ ఢీకొనడంతో నుజ్జునుజ్జయిన కారు

మీ సేవ.. మరింత చేరువ

- కొత్తగా తొమ్మిది రకాల సేవలు

కరీంనగర్ అర్బన్: మీసేవ సేవలు మరింత విస్తరించాయి. ప్రజలకు అన్ని రకాల సేవలందించేందుకు దశలవారీగా పలు అంశాలను చేర్చిన ప్రభుత్వం తాజాగా మరిన్ని సేవలను తీసుకొచ్చింది. 2011లో మీసేవ కేంద్రాలను ఏర్పాటు చేయగా దశల వారీగా నూతన సేవలను అందుబాటులోకి తెస్తూ రెవెన్యూ, రవాణా, పోలీస్, జీహెచ్‌ఎంసీ, మున్సిపల్, విద్యుత్తు, ఎండోమెంట్, వ్యవసాయ, రిజిస్ట్రేషన్, పౌర సరఫరా, విద్యాశాఖకు చెందిన ప్రస్తుతం సుమారు 300 రకాల పౌర సేవలు అందిస్తున్నారు. టీఎస్టీఎస్, టీఎస్ఆన్‌లైన్, ఇతర మీసేవ కేంద్రాలు మొత్తంగా జిల్లాలో 200లకు పైగా కేంద్రాలున్నాయి.

అదనంగా మరో 9రకాల సేవలు

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల మరో 9 రకాల సేవలను మీసేవ జాబితాలో చేర్చింది. రెవెన్యూ పరిధిలోని సేవలతో పాటు అటవీశాఖకు సంబంధించిన నూతన ఐచ్ఛికాలను అందుబాటులోకి తెచ్చింది. రెండు విద్యా కోర్సుల మధ్య గ్యాప్ పీరియడ్ ధ్రువీకరించడానికి గ్యాప్ సర్టిఫికెట్, పౌరుల పేరు మార్పిడి, పౌరుల స్థానికతను నిర్ధారించేలా లోకల్ క్యాండిడేట్(స్థానిక అభ్యర్థి) సర్టిఫికెట్, మైనార్టీలకు మైనార్టీ పథకాలు, ఉపకార వేతనాలు, రిజర్వేషన్ వంటి అంశాలను ధ్రువీకరించేలా మైనార్టీ సర్టిఫికెట్, కులం, ఆదాయ ధ్రువపత్రాల పునః జారీ(రీ ఇస్యూ), వెనుకబడిన తరగతులకు చెందిన వారికి క్రిమీలేయర్– నాన్ క్రిమీలేయర్ ధ్రువపత్రం, వయో వృద్ధుల నిర్వహణ కేసులు, పర్యవేక్షణ వ్యవస్థ వంటి సేవలు రెవెన్యూ శాఖ పరిధిలో ఉన్నాయి. వన్యప్రాణుల దాడిలో మరణించిన వ్యక్తులు, జంతువులకు సంబంధించి అందించే నష్టపరిహారం, కలప(టింబర్) డిపోలు, సామిల్ అనుమతులు, రెన్యూవల్, నిర్వహణ వంటి అటవీ శాఖ సేవలు నూతనంగా మీసేవ కేంద్రాల్లో అందుబాటులోకి వచ్చాయి. అధికారులు మీసేవ సర్వర్ సమస్యలు పరిష్కరించడంతో పాటు మీసేవ కేంద్రాల నిర్వాహకులు, ఆపరేటర్లకు నూతన సర్వీసులకు సంబంధించి అవగాహన, శిక్షణ కల్పించడం ద్వారా వినియోగదారులకు నాణ్యమైన సేవలందనున్నాయి.

పట్ట గొలుసులు చోరీ

హుజూరాబాద్: పట్టణంలోని ఓ బంగారం దుకాణంలో పట్టగొలుసు చోరీ చేయగా ఇద్దరు మహిళలను సీసీ కెమెరాలు ఆధారంగా పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.... పట్టణంలోని ఓ బంగారం దుకాణంలో ఇద్దరు గుర్తు తెలియని మహిళలు పట్ట గొలుసులు కావాలని షాపులోకి వచ్చారు. వాటిని యజమాని చూపిస్తుండగా దాచిపెట్టారు. సీసీ కెమెరాల ఆధారంగా గుర్తించిన షాపు యజమాని పోలీసులకు అప్పగించారు.

నవోదయ ఫలితాలు విడుదల

చొప్పదండి: జవహర్ నవోదయ విద్యాలయ ఫలితాలను మంగళవారం విడుదల చేశారు. విద్యాలయంలో ఆరోతరగతిలో ప్రవేశానికి 80 సీట్లకు నిర్వహించిన ప్రవేశపరీక్షలో ఎంపికైన విద్యార్థుల హాల్ టికెట్లను ఆన్‌లైన్‌లో ఉంచారు. నవోదయ వెబ్‌సైట్‌లో ఫలితాలను చూసుకోవచ్చని ప్రిన్సిపాల్ మంగతాయారు తెలిపారు. అనంతరం విద్యాలయంలో తొమ్మిదో తరగతిలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఫలితాలను విడుదల చేశారు. రిజర్వేషన్, కేటగిరీ పద్ధతిలో 14 మంది విద్యార్థులను ఎంపిక చేసినట్లు తెలిపారు.

కలప పట్టివేత



పట్టుబడిన కలపతో అధికారులు

చందుర్తి(వేములవాడ): రాజన్న సిరిసిల్ల–జగిత్యాల జిల్లాల సరిహద్దు అటవీ ప్రాంతాన్ని ఆనుకుని ఉన్న చందుర్తి– మోత్కులరావుపేట గ్రామాల మధ్య మంగళవారం వేకువజామున అక్రమంగా టేకు కలప తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు అటవీశాఖ వేములవాడ డిప్యూటీ రేంజ్ అధికారి రాఘవేందర్‌రావు తెలిపారు. కలపను స్వాధీనం చేసుకుని, ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు వివరించారు. చందుర్తి, సనుగుల బీట్ అధికారులు బాలకృష్ణ, అనిత, బేస్‌క్యాంప్ సిబ్బంది తిరుపతి, శంకర్ పాల్గొన్నారు.

జపాన్- ఆసియా యువ విజ్ఞాన మార్పిడి కార్యక్రమానికి శుభశ్రీ

కొత్తపల్లి(కరీంనగర్): జపాన్ ఆసియా యువ విజ్ఞాన మార్పిడి కార్యక్రమంలో పాల్గొనేందుకు కరీంనగర్ పద్మనగర్‌లోని పారమిత హెరిటేజ్ పాఠశాల విద్యార్థిని శుభశ్రీ సాహు ఎంపికైనట్లు చైర్మన్ ఇ.ప్రసాదరావు తెలిపారు. జపాన్‌లో జూన్ 15 నుంచి 21వ తేదీ వరకు జరగబోయే ఈ అంతర్జాతీయ కార్యక్రమంలో 14 ఆసియా దేశాల నుంచి యువత పాల్గొంటుండగా.. శుభశ్రీకి చోటు లభించడం గర్వంగా ఉందన్నారు. సాకురా ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాం అని పిలవబడే ఈ కార్యక్రమంలో రైతుల కోసం వినూత్నంగా తయారు చేసిన వ్యవసాయ యంత్రాన్ని ప్రదర్శించనుందన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు అయ్యే ఖర్చులన్నింటిని ప్రభుత్వమే భరిస్తుందని చెప్పారు. అదేవిధంగా జాతీయ స్టార్టప్ దినోత్సవ వేడుకల సందర్భంగా భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ హైదరాబాద్‌లో నిర్వహించే ఉద్యోగ మహోత్సవ్-25లో పాల్గొనడానికి ఎంపికైనట్లు తెలిపారు. ఈ మేరకు శుభశ్రీ, గైడ్ టీచర్ లలిత్ మోహన్ సాహును కలెక్టర్ పమేలా సత్పతి తన క్యాంపు కార్యాలయంలో అభినందించారు.



శుభశ్రీని అభినందిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

మరో తరానికి స్ఫూర్తినిచ్చిన మహాకవులు

- నలిమెల, జూకంటి సాహిత్య సదస్సులో వక్తలు

సిరిసిల్ల/సిరిసిల్ల కల్చరల్: మరో తరానికి స్ఫూర్తివంతమైన సాహిత్యాన్ని అందించిన ప్రసిద్ధ కవులను ప్రేరణగా తీసుకుని ఉదీయమాన కవిత్వం వెలుగుచూడాలని ఎస్సారార్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కలువకుంట్ల రామకృష్ణ అన్నారు. జిల్లాకు చెందిన సుప్రసిద్ధ కవులు డాక్టర్ నలిమెల భాస్కర్, జూకంటి జగన్నాథం సాహిత్యంపై భాషా సాంస్కృతిక శాఖ, మానేరు రచయితల సంఘం సంయుక్త నిర్వహణలో అగ్రహారంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో సాహిత్య సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ, నిరంతర భాషాధ్యయనంతో తెలంగాణ పదకోశాన్ని రూపొందించిన భాస్కర్, ప్రపంచీకరణ నేపథ్యంలో ఉనికి కోల్పోతున్న జీవితాలపై దీర్ఘకాలంగా విశ్లేషణ చేశారని గుర్తు చేశారు. తెలంగాణ పదాలపై ఒకరు, పరిసరాలపై మరొకరు చేసిన పరిశోధనల కారణంగా స్ఫూర్తివంతమైన సాహిత్యం ఆవిర్భవించిందన్నారు. తొలిసదస్సులో నలిమెల భాస్కర్, జూకంటితో పాటు కవి, విమర్శకుడు అన్నవరం దేవేందర్, మల్లావఝుల నారాయణ శర్మ, టీవీ నారాయణ పాల్గొన్నారు. మానేరు రచయితల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ పత్తిపాక మోహన్ కీలకోపన్యాసం చేశారు. అనంతరం డాక్టర్ నలిమెల భాస్కర్, జూకంటి జగన్నాథంలను నిర్వాహకులు గజమాలతో ఘనంగా సత్కరించారు. అలాగే యువ కవి దూడం గణేశ్ రచించిన మాయమైన మనిషి పుస్తకాన్ని ఆవిష్కరించారు. సదస్సు కన్వీనర్ కటుకం శారద, కళాశాల ప్రిన్సిపాల్ శంకర్, వైస్ ప్రిన్సిపాల్ లావణ్య, మారసం ప్రతినిధులు ఎలగొండ రవి, వడ్డెపెల్లి సంధ్య, బూర దేవానందం, అంకారపు రవి, ఆడెపు లక్ష్మణ్, జి. శ్రీమతి, పాకాల శంకర్, కామారపు శ్రీనివాస్, మడూరి అనిత తదితరులు పాల్గొన్నారు.



నలిమెల దంపతులను సత్కరిస్తున్న నిర్వాహకులు

ఒలింపియాడ్‌లో అల్ఫోర్స్ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న అల్ఫోర్స్ చైర్మన్ నరేందర్‌రెడ్డి



విద్యార్థుల నృత్యం

కొత్తపల్లి: ప్రముఖ పోటీ పరీక్షల సంస్థ సిల్వర్ జోన్ ఫౌండేషన్ ఇటీవల నిర్వహించిన జోనల్‌స్థాయి స్మార్ట్‌కిడ్స్ జీకే ఒలింపియాడ్‌లో కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ టెక్నో స్కూల్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జోనల్‌స్థాయిలో పతకాలు సాధించినట్లు ఆ విద్యా సంస్థల చైర్మన్ డా.వి.నరేందర్ రెడ్డి తెలిపారు. పాఠశాలకు చెందిన వి.ఆశ్రిత రెడ్డి (4వ తరగతి), సి.హెచ్.సోహన్, పి.మయాంక్ రెడ్డి (5వ), సాగి శ్రీదాత్రి, యు.రితేష్ (6వ), ఇ.లిఖిత్ కుమార్ (8వ), ఇ.రాజ్ ఆరుష్ పటేల్, కె.తనీష్ రెడ్డి, కె.రిషిక్ (10వ)లు జోనల్ స్థాయిలో మెడల్స్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ కైవసం చేసుకున్నట్లు తెలిపారు. పాఠశాలలో మంగళవారం విద్యార్థులను అభినందించారు.

అలరించిన అల్ఫోర్స్ ‘బ్లాసూమ్’ వేడుకలు

కిసాన్‌నగర్‌లోని అల్ఫోర్స్ హైస్కూల్ వార్షిక వేడుకలు అలరించాయి. స్థానిక ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం అల్ఫోర్స్ బ్లాసూమ్ పేరిట నిర్వహించిన ఈ వేడుకలకు మాజీ కార్పొరేటర్ కంసాల శ్రీనివాస్‌తో కలిసి అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డా.వి.నరేందర్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేశారు. పాఠశాల వార్షిక ప్రణాళికలో భాగంగా వివిధ క్రీడలు, పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

రైతులకు పరామర్శలే ప్రాప్తం

- అటకెక్కిన పంటల బీమా పథకాలు
- ఏటా ప్రకృతి వైపరీత్యాలతో పంటల నష్టం
- కొత్త ఇన్సూరెన్స్ పథకం కోసం రైతుల ఎదురుచూపు



ఇటీవల కురిసిన వర్షానికి జగిత్యాల రూరల్ మండలంలో నేలకొరిగిన మొక్కజొన్న పంట

జగిత్యాలఅగ్రికల్చర్: ఏటా రైతులు అయితే అధిక వర్షాలు.. లేకుంటే వడగండ్లు, ఈదురుగాలుల వంటి ప్రకృతి వైపరీత్యాలతో పంటలు నష్టపోతున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు కళ్లముందే ధ్వంసమై.. కనీసం పెట్టుబడి కూడా రాని పరిస్థితి నెలకొంది. అన్నదాతకు అండగా ఉంటామని చెబుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. కనీసం పంటల బీమా పథకాలైనా ఆదుకుంటాయని అనుకుంటే ఆ పథకాలు ఎప్పుడో అటకెక్కాయి. ఫలితంగా పంటలు నష్టపోయిన రైతులు తమ ఖర్మ అనుకుంటూ దేవుడిపై భారం వేస్తున్నారు.

పరిహారం ఇవ్వకుండా లేనిపోని నిబంధనలు

పంటలకు నష్టం వాటిల్లినప్పుడు ప్రభుత్వాలు రైతులను ఆదుకునేందుకు పరిహారం అందించాలి. కానీ ప్రభుత్వాలు ఆ ప్రయత్నాలను ఎప్పుడో మర్చిపోయాయి. పైగా పరిహారం విషయంలో ప్రభుత్వం లేనిపోని నిబంధనలు పెట్టింది. 33శాతానికి పైగా పంట నష్టం జరిగితేనే వ్యవసాయ అధికారులు నివేదిక తయారు చేసే పరిస్థితి నెలకొంది. కొన్ని అధికారులు నివేదిక పంపినా పరిహారం మాత్రం అందడం గగనంగానే మారింది. ఏటా అధిక వర్షాలతో వేలాది ఎకరాల పంట దెబ్బతిన్నప్పటికీ.. అధికారులు నివేదికలకే పరిమితమయ్యారు. మరోవైపు ప్రభుత్వం నుంచి నయాపైసా వచ్చిన పాపాన పోలేదు. ప్రస్తుత యాసంగిలో సాగుచేసిన మొక్కజొన్న, నువ్వు, వరి పంటలు ఇటీవల వడగండ్ల వర్షాలకు నేలవాలి నష్టం వాటిల్లింది. అయినా ప్రభుత్వ నిబంధనల మేరకు పంట నష్టం జరగలేదని అధికారులు నివేదిక రూపొందించడంలేదంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. వివిధ రాజకీయ పార్టీల నాయకులు మాత్రం హడావుడి చేసి రైతులను పరామర్శిస్తున్నారు తప్పితే పరిహారం ఇప్పించే దిశగా ఆలోచన చేయడం లేదు.

అటకెక్కిన బీమా పథకాలు

పంటలకు నష్టం జరిగితే పరిహారం ఇచ్చి ఆదుకునేందుకు గతంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో రెండు పంటల బీమా పథకాలు అమలయ్యేవి. మొదటిది.. పంటల బీమా పథకం (ఫసల్ బీమా యోజన), రెండోది.. వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం. ఈ పథకాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొంత ఇన్సూరెన్సు ప్రీమియం చెల్లిస్తుండగా.. మరి కొంత రైతులు చెల్లించేవారు. ఈ పథకాలను ప్రభుత్వాలు తీసుకొచ్చినా.. సరైన నిబంధనలు లేక రైతులకు బీమా అందడం లేదు. పంటల బీమా పథకంలో భాగంగా పంట రుణం తీసుకున్న రైతుల నుంచి బ్యాంకులు ప్రీమియం వసూలు చేసి ఇన్సూరెన్సు సంస్థలకు చెల్లించేవి. అయితే నష్టం జరిగినప్పుడు రైతులకు పరిహారం చెల్లించడంలో ఇన్సూరెన్స్ సంస్థలు మీనమేషాలు లెక్కించాయి. రైతు యూనిట్‌గా కాకుండా.. గ్రామాన్ని యూనిట్‌గా తీసుకోవడంతో ఏ ఒక్క రైతుకూ పంట నష్ట పరిహారం రాలేదు. పథకంలో పలు లోపాలున్నాయంటూ గత ప్రభుత్వం రద్దు చేసింది.

వాతావరణ ఆధారిత బీమా

అధిక ఉష్ణోగ్రతలు, వడగండ్లు, ఈదురుగాలుల వంటి వాతావరణ మార్పులతో మామిడి, మిర్చి, పత్తి వంటి పంటలు నష్టపోతే ఆయా పంటలకు పరిహారం వచ్చేలా ప్రభుత్వం వాతావరణ ఆధారిత పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకంలో రైతులు చేరినా నష్టం జరిగినప్పుడు పలు నిబంధనలను సాకుగా చూపి ఇన్సూరెన్సు సంస్థలు పరిహారం ఇచ్చేందుకు వెనుకంజ వేశాయి. ఇందుకోసం మండలాల్లో ఏర్పాటు చేసిన వాతావరణ కేంద్రాలు ఇచ్చే సమాచారాన్ని ప్రమాణికంగా తీసుకున్నాయి. క్షేత్రస్థాయిలో పంట నష్టం జరిగితే వాతావరణ కేంద్రం నుంచి సరైన సమాచారం వెళ్లకపోవడంతో ఇన్సూరెన్సు సంస్థలు పరిహారం ఇచ్చేందుకు నిరాకరించాయి. దీనిపైనా రైతులు ఆందోళనలు చేశారు. అయినా ఇన్సూరెన్స్ సంస్థలు పట్టించుకోకపోవడంతో ఈ పథకాన్ని కూడా గత ప్రభుత్వం రద్దు చేసింది.

ఊరిస్తున్న పంటల బీమా పథకం

ఇప్పటివరకు ఉన్న బీమా పథకాలు రైతులకు న్యాయం చేయలేకపోయాయని, కొత్తగా ఆమోదయోగ్యమైన బీమా పథకాన్ని తీసుకొస్తామని ప్రభుత్వం భరోసా ఇస్తోంది. గ్రామం యూనిట్‌గా కాకుండా రైతును యూనిట్‌గా తీసుకుంటామని, ఏ పంటకు నష్టం జరిగినా ఇన్సూరెన్సు సంస్థ పరిహారం అందించేలా చూస్తామని చెబుతోంది. ఇన్సూరెన్సు సంస్థలకు ప్రీమియం కూడా చెల్లిస్తామని చెబుతున్నా.. ఎప్పుడు అమల్లోకి వస్తుందో తెలియడం లేదు. తాజాగా వడగండ్లతో నష్టపోయిన పంటలకు పరిహారం అందించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

పరిహారం ఇవ్వాలి



ఇన్సూరెన్స్ పథకాలు అమల్లో లేకపోవడంతో నష్టపోయిన పంటలకు ప్రభుత్వం ఎకరాకు రూ.20వేల చొప్పున పరిహారం అందించి రైతులను ఆదుకోవాలి. ఇది నాలాంటి రైతులందరి సమస్య. పంటలు సాగు చేసిన చాలామంది రైతులు పంటలు నష్టపోయి ఇబ్బంది పడుతున్నారు. – బందెల మల్లయ్య, చల్‌గల్, జగిత్యాల

ప్రభుత్వానికి నివేదిస్తాం



జిల్లాలో జరిగిన నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిస్తాం. రైతులకు ఆమోదయోగమైన ఇన్సూరెన్స్ పథకాలు తెచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఆ విధానం అమల్లోకి వస్తే రైతులందరికీ న్యాయం జరుగుతుంది.

– భాస్కర్, జిల్లా వ్యవసాయాధికారి, జగిత్యాల